# 21. పేకాట మంత్రులు

పాటియాలా సంస్థానాధీశులు మహారాజా భూపేంద్ర సింహాజీ వారు అనేకానేక లలిత కళలలో అపార ప్రావీణ్యం కలవారు.

పేకాట వారి ప్రియమైన క్రీడలలో ప్రముఖమైనది. అందునా మూడు ముక్కలాట సంగతి చెప్పనవసరమేలేదు.

అయితే, శ్రీవారు దారినపోయే దానయ్యలతో పేకాడరు. తోటి మహారాజులతో ఆడి లోగడనే లక్షలాది రూపాయలు ఓడి బుద్ధి తెచ్చుకుని ఉన్నారు,

కనుక, శ్రీవారు తమ పేక సరదా తీరాలంటే ఇంట్లోనే, ఆంత రంగికులతోనే ఆడుకోవడం ఉత్తమోత్తమం అని తీర్మానించుకుని ఉన్నారు. ఓడినా డబ్బు వెళ్లేది తమ వారికేగానీ సంస్థానం బయటకు కాదుగాదా!

కనుక శ్రీవారు పేకాడ బుద్ధేసినపుడల్లా తన కత్యంత ప్రియతములైన ఒక రిద్దరు మహారాణులనూ, సన్నిహితులైన ఇద్దరు ముగ్గురు సంస్థానోద్యోగులనూ, మంత్రులనూ మాత్రం మూడు ముక్కలాటకు ఆహ్వానించేవారు.

సాధారణంగా ఈ ఆట అర్ధరాత్రి వేళ మొదలై తెల్లవారుజాము దాకా జరుగుతుండేది. అందరికీ ఖరీదయిన మధ్య పానీయాలూ, ఆహారమూ సరఫరా అయ్యేది. ఆట సరదాగా గడచిపోయేది. ఆట పూర్తయే

సరికి మహారాజా భూపేంద్ర సింహాజీ వారి జేబు బరువెక్కిపోతుండేది.

ఎందుకంటే, మహారాజావారు ఆట న్యాయంగా ఆడరు, శ్రీవారు రూల్సు పాటించరు. అయినా, అదే మనగలవారు లేరు శ్రీవారు ఆడిందే ఆట, వారు చెప్పిందే రూలు. కనుక ఓడినా వారే గెలిచినట్టు లెక్క.

కానీ, మంత్రులకూ, మహారాణులకూ ఇతర ఉద్యోగులకూ మాత్రం ఈ మూడు ముక్కలాటలు ప్రాణాంతకంగా పరిణమించసాగాయి. వారి నెల సంపాదనంతా ఒక్కరాత్రి పేకాటకు మహారాజా వారికి ధార పోయాల్సి వస్తుండేది

అందుకని, ఓ సుదినాన వారందరూ ఓ రహస్య సమావేశం జరుపుకుని, ఆలోచించుకుని ఏం చేశారంటే...!

పేకాటకు మహారాజా వారి నుండి పిలుపు రాగానే జేబులు ఖాళీ చేసుకుని, కేవలం పది పాతిక రూపాయల పర్సుతో హాజరయ్యేవారు. ఆ తెచ్చిన మొత్తం ఒక్క ఆటకూ్కడా సరిపోయేదిగాదు.

అందుకని, దయదలచిన మహారాజావారు బీదమంత్రుల పరిస్థితిని అర్థం చేసుకున్నవారై !

కోశాధికారిని పిలిచి ఏమని ఆజ్ఞాపించారంటే...!

పేకాటలో ఓడిపోయి, ధారపోసుకునేందుకుగాను, పేకాట ఆహ్వానితులకు వారు ఎంత కావాలంటే అంతా ప్రభుత్వ ఖజానా నుండి రోజూ అప్పివ్వమని శ్రీవారు ఆదేశించారు.

కర్నల్ మోహిందర్‌సింగ్ అనబడే సదరు కోశాధికారి అంతఃపురంలో పేకాట జరగనున్నదని కబురు రాగానే ఓ ఇనప్పెట్టె నిండా నాణేలు నింపుకుని పేకాట గదిలో ఓ మూల వేచి ఉండేవాడు.

ఆట మొదలవగానే మంత్రులూ, మహారాజులూ అతని వద్దకు పోయి, కావలసినంత డబ్బు తెచ్చుకుని, మహారాజా వారితో ఆడి సంతోషంగా ఓడి పోయేవారు. వారు ఎంత అడిగినా కోశాధికారి కిమ్మనకుండా ఇచ్చి తీరవలసిందే!! కాదనేందుకు వీలులేదు. తిరిగి వసూలు చేసేందుకు దమ్మూమ్మలూ లేవు.

కనుక, ఆటలో పాల్గొనే వారంతా అవకాశాన్ని సద్వినియోగం జేసుకుని, వారికి నిజంగా అవసరం ఉన్నా. లేకున్నా ఇనప్పెట్టె ఖాళీ అయేదాకా అడపా దడపా ఆ మూలకు వెళ్ళి జేబులు నింపుకు వస్తుండే వారు. ఆ విధంగా ఒక్కో రాత్రి ఒక్కొక్కరికి కొన్ని వేలు గిట్టేది.

మహారాజా భూపేంద్ర సింహజీ వారికి ఈ గొడవలు అనవసరం. పేకాటలో గెలవటమే వారికి ప్రధానం. రోజుకో ఇనప్పెట్టెడు ధనం ఖర్చయితేనేం గాక! ఖజానా నింపేందుకు అనేక మార్గాలు.

కనుక...!

పాటియాలాలోని కొన్ని దివ్య హర్మ్యాలు పేకతో కట్టినవేనని మీకు ఎవరేనా చెపితే నవ్వకండి.

★